క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన

శంకర్‌పల్లి: ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ సూచించారు. సోమవారం ఆయన మహారాజ్‌పేట్‌లో బీసీ కుల వృత్తుల రుణాల దరఖాస్తుదారుల జాబితాను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వారి స్థితి గతులను తెలుసుకున్నారు. అర్హులకే రూ.లక్ష ఆర్థిక సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, కార్యదర్శి రమ్య ఉన్నారు.

కార్మికులకు ఉచిత పరీక్షలు

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నగరంలోని సీఎస్‌సీ హెల్త్ కేర్ అండ్ వెల్‌నెస్ సెంటర్ వారు ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో లేబర్ కార్డు ఉన్న సుమారు వంద మంది కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నందిగామ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సోమవారం సంకల్ప్ పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో మత్తు పానీయాల వ్యతిరేక దినం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జెండా ఊపి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సంకల్ప్ పునరావాస కేంద్రం మత్తుకు బానిసలుగా మారిన వారిలో మార్పు తెచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప్ పునరావాస కేంద్రం కో ఆర్డినేటర్ తిరుపతిరావు, ఉప సర్పంచ్ కుమార్‌గౌడ్, హెచ్ఎం దినేశ్, హెల్త్ కో ఆర్డినేటర్ బిందు, కౌన్సిలర్ స్రవంతి, అడ్మినిస్ట్రేషన్ కో ఆర్డినేటర్ సుజాత, ఆశ వర్కర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ ర్యాంకర్లకు నగదు బహుమతి



విద్యార్థులను సన్మానించి నగదు బహుమతి అందజేస్తున్న సిద్దేశ్వర్

చేవెళ్ల: పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు సాధించడం అభినందనీయమని పీసీసీ నియోజకవర్గ మెంబర్ రాచమల్ల సిద్దేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకర్లు మల్లిక, అనూషలకు రాచమల్ల చెన్నమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేల నగదు బహుమతి అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మధుసూదన్‌గుప్తా, ప్రభాకర్, నాయకులు వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేశ్, సురేశ్, రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, కుమార్, నాగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదతరులు ఉన్నారు.

హామీల అమలులో ఇరు ప్రభుత్వాలు విఫలం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం కడియాలకుంట తండాలో నూతన గ్రామ కమిటీకి నియామకపత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా తావ్‌సింగ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమేశ్, ఉపాధ్యక్షుడిగా చందు, రాజు, హన్మంత్, దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా లచ్చిరాం, కోశాధికారిగా మహేశ్, సభ్యులుగా మల్లేశ్, దీప్లా, వెంకటేశ్, రమేశ్, దేవేందర్, రవి, రాంసింగ్, నందు, శివ, శంకర్, ప్రవీణ్, పాండు, తుల్జా, సంతోశ్, జగన్ తదితరులు ఎన్నికయ్యారు. శంకర్, సేవ్యా నాయక్, రవి, బిచ్చ, రాజు, మోహన్, రెడ్యా, పీర్యా నాయక్, శంకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పాటు

చేవెళ్ల: పేదల విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తామని కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌బాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుండాల ప్రాథమిక పాఠశాలలో మధుసూదన్‌రెడ్డి, అంతారం పాఠశాలలో వెంకటేశ్‌బాబు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సహకరించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభ చాటాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్

షాబాద్: యువత రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొని తమ ప్రతిభ చూపాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన హైతాబాద్‌లో మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ యువశక్తిని మేల్కొల్పేందుకు కాంగ్రెస్ చేపట్టిన రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్.శేఖర్, సహకార సంఘం డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు శేఖర్, శ్రీరాములు, రవి, చంద్రయ్య, ఏపీరెడ్డి, సత్తయ్య, శ్రీకాంత్, పవన్, కావలి శ్రీకాంత్, చంద్రం, నర్సింహులున్నారు.

సంత.. తీరని చింత!

ప్రజలకు తక్కువ ధరలకే తాజా కూరగాయలను అందించేందుకు శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయ రూర్బన్ పథకం కింద ప్రభుత్వం గ్రామ సంతలు ఏర్పాటు చేసింది. మండల పరిధిలో 14 సంతలు ఏర్పాటు చేయగా ఆరుమాత్రమే వినియోగిస్తున్నారు. మిగిలినవి నిరుపయోగంగా మారాయి. దీంతో మళ్లీ రోడ్లపైనే విక్రయాలు కొనసాగిస్తున్నారు.

- రెండేళ్లకే శిథిలావస్థకు చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా మారిన దొంతాన్‌పల్లి సంత

శంకర్‌పల్లి: రైతులకు రవాణా ఖర్చు.. కొనుగోలుదారులకు తాజా కూరగాయలను అందించేలనే సంకల్పంతో ప్రభుత్వం మండల పరిధిలోని 14 గ్రామాల్లో గ్రామ సంతలు నిర్మించింది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. కొత్తపల్లి, కొండకల్, మహారాజ్‌పేట్, మహాలింగపురం, ఆలాన్‌ఖాన్‌గూడ, లక్ష్మారెడ్డిగూడ గ్రామాలు తప్ప మిగిలిన ఎనిమిది గ్రామాల్లో సంతలు నిరుపయోగంగా మారాయి.

శిథిలావస్థకు చేరుతున్న సంతలు

2020లో ప్రభుత్వం ఒక్కో గ్రామ సంత నిర్మాణానికి రూ.12.25లక్షల నిధులు కేటాయించింది. ఈ నిధులతో జాతీయ ఉపాధిహామీ పథకం అధికారుల పర్యవేక్షణలో సంతలు నిర్మించారు. కొత్తపల్లి, కొండకల్, మహారాజ్‌పేట్, మహాలింగపురం, ఆలాన్‌ఖాన్‌గూడ, లక్ష్మారెడ్డిగూడ సంతలు వినియోగిస్తున్నారు. ఇంద్రారెడ్డి నగర్, గోపులారం, దొంతాన్‌పల్లి, జనవాడ, గాజులగూడ, టంగటూరు, అంతప్పగూడ, రావులపల్లి కలాన్‌లో గ్రామానికి దూరంగా ఉన్నాయని.. పర్యవేక్షణ చేయాల్సిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో వాడకం చేయడం లేదని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. వినియోగంలో లేని సంతలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పశువులు, కుక్కలకు ఆవాసాలు మారుతున్నాయి. రెండేళ్లకే పిచ్చి మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

గ్రామ సంతలు నిర్మించిన కాంట్రాక్టర్ నాణ్యత పాటించకపోవడంతో జనవాడ, గోపులారం, కొండకల్, దొంతాన్‌పల్లి గోడలు బీటలు వారాయని, గేట్ల దిమ్మెలు విరిగిపోయాయని గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. టాయిలెట్స్ అధ్వానంగా తయారై డోర్‌లు, కిటికీలు విరిగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని సంతలు వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉపయోగంలోకి తీసుకువస్తాం



గ్రామ సంతలను ఉపయోగంలోకి తీసుకువస్తాం. సంతల నిర్మాణాల్లో నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మండల పరిధిలోనలి ఆరు గ్రామాల్లో గ్రామ సంతల్లోనే రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారు. త్వరలోనే మిగిలిన సంతల్లోనూ విక్రయాలు చేపడుతారు.

– నాగభూషనం, ఏపీఓ

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



వైద్య పరీక్షలకు హాజరైన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇప్పలపలి, దత్తాయపల్లి, దేవునిగుడితండా, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో ట్రస్టు ఆధ్వర్యంలో నమో ఆరోగ్యమస్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోగులకు ఉచిత పరీక్షలు చేసి మందులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, మోహన్ నాయక్, నరేందర్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్‌తో కలిసి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని దత్తాయపల్లి, ఇప్పలపల్లి, దేవునిగుడితండా, పోమాల్‌పల్లి గ్రామాల్లో పర్యటించి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండానే ప్రజలకు మోసం చేసేందుకు కొత్త హామీలతో గ్రామాల్లో పర్యటిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌సింగ్, సుధాకర్, విజయ్‌భాస్కర్, శ్యాంసుందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అకుల ప్రదీప్, సుభాశ్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్, కృష్ణారెడ్డి, అంజయ్య, నర్సింహ, మల్లేశ్, వెంకటేశ్, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సర్పంచ్ అమృతమ్మ

షాద్‌నగర్: గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అమృతమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెలిజర్లలో 1,2 వార్డుల్లో పంచాయతీ నిధులతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులు పూర్తి చేసి ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేకూరుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసకువచ్చేందుకు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని సూచించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి శంకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, ఎల్గనమోని యాదయ్యయాదవ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహం

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న వరంగల్ ఎన్ఐటీ అధికారులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల చేవెళ్ల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. నాలుగు రోజుల క్రితం రాజేంద్రనగర్‌లో నిర్వహించిన ఇన్నోవేషన్ కార్యక్రమానికి పాఠశాల నుంచి హాజరైన విద్యార్థులకు వరంగల్ ఎన్ఐటీలో రెండు రోజులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారిని సోమవారం అభినందించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభ వెలికి తీసి కొత్త ప్రయోగాలు చేసేలా ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఇన్‌స్పైర్–మనక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 2022లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన చేవెళ్ల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఆ విద్యార్థులకు గైడ్ టీచర్ జాతీయ స్థాయి పోటీలకు వరంగల్ ఎన్ఐటీలో శిక్షణ ఇప్పించారని వివరించారు.

పరిహారం ఇప్పించాలని ఆందోళన



పీఎస్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు

కేశంపేట పీఎస్ ఎదుట బైఠాయించిన మృతుడి బంధువులు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు జంగయ్య ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి భార్య యాదమ్మ, అరవింద్, అనూష సంతానం. వీరి పోషణకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రమాద కారకులను గుర్తించి వారినుంచి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుడి కుటుంబీకులు, బంధులు కేశంపేట పీఎస్ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఎల్గమోని రవీందర్‌యాదవ్ అక్కడకు చేరకుని మాట్లాడారు. మృతుడి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని.. ప్రమాద కారకులకు శిక్షపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ హామీ మేరకు వారు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో బాలరాజ్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చదువులకు చర్యలు తీసుకోండి



ఎంపీడీఓ వెంకయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎంసీ చైర్మన్లు

శంకర్‌పల్లి: మండల పరిధిలో ప్రైవేట్ వెంచర్లలో పని చేస్తున్న వారి చిన్నారుల చదువులపై యాజమాన్యాలు ప్రత్యేక చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంవీఎఫ్, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్మన్లు శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రియాకం, ఎంఈఓ అక్బర్‌ను కోరారు. ఈ మేరకు వారు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. వినతిపత్రాలు ఇచ్చిన వారిలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్లు మహేందర్‌గౌడ్, శ్రీకాంత్, జంగయ్య, మల్లేశ్, మదర్స్ కమిటీ చైర్మన్ లక్ష్మీ, ఎంవీఎఫ్ బృందం సభ్యులు నాగమణి, మంగమ్మ తదితరులున్నారు.



హిందీ పండిట్‌ను సన్మానించిన 1988-89 బ్యాచ్ పెద్దమంగళారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

మొయినాబాద్: మండల పరిధిలోని పెద్దమంగళారం జెడ్పీహెచ్ఎస్‌లో 1988–89 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 35ఏళ్ల క్రితం జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన హిందీ పండిట్ రాములును ఘనంగా సన్మానించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరించండి

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

చేవెళ్ల: మహిళల ఆర్థికాభివృద్ధితో కుటుంబాలు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఆయన స్వగ్రామం ధర్మసాగర్‌లో మహిళల కోసం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన తల్లి జ్ఞాపకార్థం జయలతమ్మ మహిళా అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలోని మహిళలకు కుట్టుమిషన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కల్పించేందుకు ఈ కేంద్రం పనిచేస్తోందని చెప్పారు. శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా శిక్షకులను నియమించి కుట్టు మిషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు వచ్చి ఇక్కడ శిక్షణ పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, దేవునిఎర్రవల్లి సర్పంచ్ మానిక్యరెడ్డి, బీజేపీ నాయకులు కంజర్ల ప్రకాశ్, పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి, నాయకులు శ్రీపాల్ రెడ్డి, కృష్ణగౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్, కుమార్‌గౌడ్, కృష్ణారెడ్డి, రవీందర్, సత్యనారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, బాల్‌రెడ్డి, కృష్ణమోహన్, మధూకర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, సంగారెడ్డి, చంద్రారెడ్డి, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

పెన్షనర్ల సంఘం తాలుకా అధ్యక్షుడు రామారావు



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం తహసీల్దార్‌కు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. 1వ పీఆర్‌సీకి అనుగునంగా పెన్షనర్ల మూల పెన్షన్ నుంచి ఒక శాతం మినహాయించి పూర్తి స్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఆర్‌లను చెల్లించాలని, నెలల తరబడి ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. జీవన వ్యయం విపరీతంగా పెరిగినందున పెన్షనర్లకు కనీసం రూ.30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జనార్ధన్, పాండు, శంకర్‌జీ, యాదగిరి చారి, గిరిజ, మాణిక్యం, రమాదేవి, నాగేశ్వర్, తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: వచ్చే నెల 3న నిర్వహించే దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ, బహిరంగ సభకు కురుమ కులస్తులు పెద్ద ఎత్తున హాజరై విజవయంతం చేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాపోలు నర్సింలు, మండల ఉపాధ్యక్షులు సత్తి, సాయినాథ్, మల్లేశ్, ప్రధాన కార్యదర్శి కుమార్, కార్యదర్శులు ప్రవీణ్, మహేందర్, రాములు, పరిగి నర్సింలు, మీడియా ఇన్‌చార్జి రాఘవేందర్, ఎర్ర నర్సింలు, రాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు రాములు, కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రవి తదితరులున్నారు.

ఫీ‘జులుం’పై చర్యలు తీసుకోవాలి

- ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుప్రసాద్
- పాఠశాలల బంద్ విజయవంతం
- ముందస్తు సెలవు ప్రకటించిన ప్రైవేటు స్కూల్స్

షాద్‌నగర్: ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని.. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యారంగంలో సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు పాఠశాల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం షాద్‌నగర్‌లో ఏబీవీపీ నేతలు నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పట్టణంలో ఏబీవీపీ నేతలు బైక్ ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ పాఠశాలలను మూసి వేయించారు. బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు ముందుగానే సెలువు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నేతలు భానుప్రసాద్, పుట్నాల సాయి కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యార్థులకు నేటికీ పుస్తకాలను పంపిణీ చేయలేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నార న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీశ్వర్, సురేశ్, శ్రీకాంత్, చంద్ర ప్రకాశ్, రామకృష్ణ, పవన్, శివకుమార్, చింటూ, సిద్ధు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులతో ఇబ్బందులు

నందిగామ: ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థలు పెంచిన ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఏబీవీపీ కొత్తూరు మండల కన్వీనర్ నరేశ్ అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కొత్తూరులో ఆయన సోమవారం పాఠశాలలను బంద్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫీజుల పెంపుపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శివకుమార్, శ్రీకాంత్, హర్ష యాదవ్, నాని, సుదర్శన్, నీలకంఠం, జశ్వంత్, రాజు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

శంకర్‌పల్లి: విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హర్షవర్ధన్ నాయక్ అన్నారు. సోమవారం ఏబీవీపీ పాఠశాలల బంద్‌కు పిలుపునివ్వడంతో స్థానిక నాయకులతో కలిసి పాఠశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు, యూనిఫాంలు అందజేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాకేశ్, మృషికేశ్, శ్రీకంత, నితిన్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

షాబాద్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ క్లాం సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ పిలుపుమేరకు సోమవారం మండల కేంద్రంలో విద్యా సంస్థల బంద్ విజయవంతమైంది. షాద్‌నగర్–చేవెళ్ల రోడుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి.. ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజులు నియంత్రించాలని, అధిక ఫీజులతో పాటు అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ ఇన్‌చార్జి శ్రీకాంత్, నాయకులు బాలు, మధుకిరణ్, అభినవ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ నిర్వీర్యం

మొయినాబాద్: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఏబీవీపీ నగర కార్యదర్శి బట్టు వినయ్ అన్నారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల బంద్ నిర్వహించారు. అందులో భాగంగా ఏబీవీపీ కార్యకర్తలు మండల పరిధిలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు.



షాద్‌నగర్: ఏబీవీపీ నాయకుల బైక్ ర్యాలీ



షాబాద్: రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు